ఘనంగా సిద్ధి వినాయకుని ఆలయ వార్షికోత్సవం

ఎస్.రాయవరం : ఉప్పరాపల్లి గ్రామంలో శ్రీ సిద్ధి వినాయక ఆలయ 4 వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఈ ఆలయ నిర్మాణం చేసినప్పటి నుంచి వార్షికోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది.

నవ వసంత వేళ...ఆత్మీయ హేల


మునగపాక పరదేశమ్మ తల్లి గుడి ఆవరణలో..


కొండకర్ల ఆవ వద్ద ఆత్మీయ కలయిక

మునగపాక : మండల కేంద్రంలో ఆదివారం పలు కుటుంబాలకు చెందిన వారంతా ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. మునగపాక జిల్లా పరిషత్ హైస్కూల్లో పూర్వ విద్యార్థులు సందడి చేశారు. మునగపాకకు చెందిన కర్రి వారి కుటుంబ సభ్యులు స్థానికంగా ఉన్న పరదేశమ్మ తల్లి గుడి వద్ద ఆత్మీయ సమావేశంనిర్వహించారు. కర్రి సత్యనారాయణ, కోటి, రాజు, ప్రసాద్,భాస్కరావు పాల్గొన్నారు. మునగపాకకు చెందిన కాండ్రేగుల వారి కుటుంబాలకు సంబంధించిన వారంతా పరదేశమ్మ గుడి ఆవరణలో మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. పరదేశినాయుడు,గణేష్, మణికంఠ పాల్గొన్నారు. మునగపాక జిల్లా పరిషత్ హై స్కూల్లో 1997–98లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా కుటుంబ సభ్యులతో ఆత్మీయ సమావేశమయ్యారు. పదో తరగతి చదువుకొని 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఒకరికొకరు పలుకరించుకొని సందడి చేశారు. నాడు విద్య నేర్పిన గురువులను సత్కరించుకున్నారు.

కొండకర్ల ఆవలో...

అచ్యుతాపురం : మండలంలోని కొండకర్ల వద్ద పలు బ్యాచ్ విద్యార్థులు వనసమారాధన నిర్వహించారు. ఆదివారం కావడంతో పాటు ఏడాది చివరి కావడంతో కొండకర్ల ఆవలో విహరించారు. దీంతో కొండకర్ల ఆవ పరిసరాలు సందడిగా మారాయి. అచ్యుతాపురం ఉన్నత పాఠశాలలో 1996–97 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ కలయికలో పాల్గొన్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. కొండకర్ల జడ్పీ హైస్కూల్లో 1988–89 బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ కలయిక నిర్వహించారు.


సమావేశమైన 1996-97 బ్యాచ్ టెన్త్ పూర్వ విద్యార్థులు

ఆనాటి ఆస్నేహమానంద గీతం

యలమంచిలి : కె.పురుషోత్తపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు కలసి చదువుకున్న1996–97 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఇక్కడి పాఠశాలలో కలిశారు. విద్యార్థులంతా ఒక సంఘంగా ఏర్పడి తమతో పాటు చదువుకుని మరణించిన 8మంది విద్యార్థుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేలా తీర్మానించుకున్నారు. ఆలాగే తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి పాటుపడతామని తెలిపారు. అనపర్తి రాజు, మేడిశెట్టి శ్రీను, ఉష, రాజాన భాస్కరరావు, ఇత్తంశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

రాజాధిరాజ వాహనంపై వెంకన్న

నక్కపల్లి : ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం స్వామివారిని రాజాధి రాజవాహనంలో తిరువీధి సేవలు నిర్వహించారు. కొండపై మూలవిరాట్‌కు ఉదయం పంచామృత అభిషేకం, నిత్యార్చనలు నిర్వహించారు. కొండదిగువన క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి సన్నిధి, ఉత్సవమూర్తులు గోదాదేవి అమ్మవారి సన్నిధిలో పూజల అనంతరం తిరువీధి సేవలు నిర్వహించారు.

గంజాయి కేసులో మరొకరికి రిమాండ్

యలమంచిలి రూరల్: యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో వివిధ కేసులకు సంబంధించి భద్రపరిచిన గంజాయి చోరీకి పాల్పడిన కేసులో మరో నిందితుడిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈస్ట్ గంగవరానికి చెందిన ఉయ్యాల శ్రీనివాసరావును 9వ నిందితుడిగా ఈ కేసులో యలమంచిలి ఏజేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి నిందితుడు శ్రీనివాసరావుకు జ్యుడీషియల్ రిమాండ్ విధించారు.ఈ మేరకు నిందితుడ్ని యలమంచిలి రూరల్ పోలీసులు విశాఖ కేంద్ర కారాగారానికి తరలించారు. ఇదే కేసులో ఆరుగురిని అరెస్ట్ చేసి విశాఖ సెంట్రల్ ప్రిజన్‌కు రిమాండుకు, ఇద్దరు మైనర్లను జువెనైల్‌హోంకు ఇప్పటికే తరలించారు. యలమంచిలి పట్టణానికి చెందిన మరో నిందితుడు కార్తీక్ పరారీలో ఉన్నాడు.అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు.

దంపతులపై దాడి


దాడిలో గాయపడిన దంపతులు

యలమంచిలి రూరల్: వ్యక్తిగత దూషణలతో క్షణికావేశానికి గురైన ఓ కుటుంబానికి చెందిన ముగ్గురు పొరుగునున్న దంపతులపై విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన మండలంలోని పులపర్తిలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితులు,వైద్య సిబ్బంది తెలియజేసిన వివరాల ప్రకారం పులపర్తి బీసీ కాలనీ రైస్ మిల్లు పక్కన నివాసముంటున్న దంపతులు పెద్దాడ బేబీ,భర్త కల్యాణ్,సమీపంలో నివాసముంటున్న మరో కుటుంబానికి ఆదివారం ఉదయం స్వల్ప వివాదం ఏర్పడింది. తన ద్విచక్రవాహనం తాళాన్ని ఎవరో విరగ్గొట్టారంటూ బేబీ తిట్టుకుంటుండగా తమనే దూషిస్తున్నారనుకుని ఓ కుటుంబానికి చెందిన ముగ్గురు కర్రలతో తమపై దాడి చేశారని బేబీ ఆరోపిస్తోంది. తన భర్తను కూడా ముగ్గురూ ఇష్టానుసారంగా కొట్టారని తెలిపింది. ఈ దాడిలో బేబీ కుడి చేయిపై తీవ్ర గాయమైంది. 15 కుట్లు వేసినట్టు వైద్య సిబ్బంది తెలిపారు. ఆమె భర్త కల్యాణ్‌కు కూడా ప్రథమ చికిత్స అందజేశారు. అయితే ఆరోపణలెదుర్కొంటున్న కుటుంబం కూడా బేబీ, ఆమె భర్త తమపై దాడి చేశారని ఆరోపిస్తూ యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి చికిత్స కోసం వచ్చారు. ఇరు కుటుంబాల వారు యలమంచిలి రూరల్ పోలీసులను ఆశ్రయించారు.

రైల్వే రిజర్వేషన్ కౌంటర్ పునరుద్ధరణకు వినతి

ఎస్.రాయవరం : నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్‌లో రైల్వే రిజర్వేషన్ కౌంటర్ తొలగించడం అన్యాయమని సీపీఎం నాయకులు ఎం.అప్పలరాజు, సత్యనారాయణ పేర్కొన్నారు. పూర్వం నుంచి రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌కు ప్రత్యేక ఆదర ఉండేదని అన్నారు. జన్మభూమి, ఈస్ట్‌కోస్ట్, రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ హాల్టు కూడా కల్పించాలని ప్రయాణికుల డిమాండ్ ఉందని అయితే, ఇవి పరిశీలనలోకి తీసుకోకుండా ఉన్న రిజర్వేషన్ కౌంటర్ మూసివేయడం తగదని అన్నారు. ఈ మేరకు స్టేషన్‌మాస్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

పూరిల్లు దగ్ధం

పాయకరావుపేట : గజపతినగరం గ్రామంలో శనివారం అర్ధరాత్రి ఓ పూరిల్లు దగ్ధం అయిందని డీటీ కె.నూకరాజు తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గ్రామానికి చెందిన కాకాని కొండయ్య పూరిల్లు, ఇంటిలో వున్న దుస్తులు, వంటసామాగ్రి కాలిపోయాయన్నారు. సుమారు రూ.80 వేలు నష్టం వాటిల్లి ఉంటుందని డీటీ తెలిపారు. ప్రభుత్వ పరంగా ఆదుకోవడం జరుగుతుందన్నారు.



గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.











న్యూ ఇయర్ జోష్

- అంబరాన్నంటిన న్యూ ఇయర్ సంబరాలు
- 2024కి సాదర స్వాగతం పలుకుతూ వేడుకలు
- వాడవాడలా రంగవల్లులతో ముస్తాబు
- ఆటపాటలతో సందడి

కాలగర్భంలో మరో ఏడాది కలిసిపోయింది. తీపి, చేదు జ్ఞాపకాల కలయికతో చరిత్రలో మిగిలిపోయింది. కష్టసుఖాలను సమానదృష్టితో చూసే ప్రజలు 2023 సంవత్సరానికి ఘనంగా వీడ్కోలు పలికి 'ఉందిలే మంచి కాలం ముందుముందునా...' అంటూ ఆశావహ దృక్పథంతో కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టారు. మిత్రులు, బంధువులతో కలిసి సంబరాలు జరుపుకొన్నారు.


పాయకరావుపేటలో కేక్, మిఠాయి దుకాణాలు


అడ్డురోడ్డు జంక్షన్‌లో న్యూఇయర్ బొకేలు


యలమంచిలిలో రంగుల విక్రయాలు

నక్కపల్లి / యలమంచిలి రూరల్ / రాంబిల్లి / ఎస్.రాయవరం : నేలపై ఇంద్ర ధనుస్సు వెల్లివిరిసినట్టు వాడవాడలా వీధుల్లో రంగు రంగుల ముగ్గులతో ముస్తాబు చేశారు. కొత్త సంవత్సరంలో సహచరులు, మిత్రులకు శుభాకాంక్షలు చెప్పడానికి జనమంతా పండ్లు, మిఠాయిలతో సిద్ధమవుతున్నారు. పిల్లలు, యువత ఎస్ఎంఎస్‌లు, ఈ–మెయిల్స్, ఇంటర్నెట్‌లో చాటింగ్, ఫోన్‌లలో టెలిగ్రామ్, హైక్, మెసెంజర్, వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ తదితర సోషల్ మీడియా ద్వారా తమ స్నేహితులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపే పనిలో నిమగ్నమయ్యారు. పాఠశాలల్లో విద్యార్థులు ముందుగానే నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సంబరాలు చేసుకున్నారు.

మార్కెట్‌కు న్యూ ఇయర్ శోభ

పాయకరావుపేట, నక్కపల్లి, అడ్డురోడ్డు పట్టణాల్లో ఫ్లవర్ బొకేలు, కేక్‌లు, స్వీట్ల దుకాణాలను తాత్కాలికంగా భారీ స్థాయిలో ఏర్పాటు చేశారు. ఈ దుకాణాలు కొనుగోలుదారులతో రద్దీగా ఉన్నాయి. అలాగే జాతీయ రహదారి పక్కన పట్టణ ప్రాంతాల్లో పలు డాబాలు, రెస్టారెంట్ల వద్ద వెజ్ , నాన్‌వెజ్‌లలో వివిధ రకాల వంటకాలను సిద్ధం చేస్తున్నారు. బేకరీలు, స్వీట్ల దుకాణాలు, రెస్టారెంట్లు, డాబాల వద్ద రంగురంగుల విద్యుద్దీపాలంకరణ చేశారు. న్యూఇయర్ వేడుకల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పాయకరావుపేట, నక్కపల్లి సీఐలు అప్పలరాజు, అప్పన్న తగు చర్యలు తీసుకున్నారు.

ప్రజా ప్రతినిధుల ఇళ్ల వద్ద హడావిడి

ఎన్నికల సంవత్సరం కావడంతో వివిధ పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధుల ఇళ్లు, క్యాంపు కార్యాలయాల వద్ద సందడి నెలకొంది. ఆశావహులు నియోజకవర్గాల్లో అందుబాటులో ఉంటున్నట్టు ఇప్పటికే ప్రకటనలు విడుదల చేశారు.రాబోయే ఎన్నికల్లో ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉవ్విళ్లూరుతున్న ఆశావహులందరికీ తమ అభిమానులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు సిద్ధమవుతున్నారు. తమ వద్దకు వచ్చే అభిమానులకు ముఖ్యనేతలంతా అల్పాహారం ఏర్పాటు చేస్తున్నారు.

మత్స్యావతారంలో పాండురంగడు



పాయకరావుపేట : పట్టణంలో గల శ్రీరాధారుక్మిణీ సహిత పాండురంగ స్వామి ఆదివారం మత్స్యావతారంలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా పాండురంగ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తుని, పాయకరావుపేట పట్టణాలకు చెందిన పలువురు భక్తులు పాండురంగ స్వామిని దర్శించుకుని, పూజలు చేశారు. ఆలయ అర్చకులు యియ్యుణ్ణి కృష్ణస్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందిస్తున్నారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆధ్వర్యంలో ఘనంగా పూజలు జరుగుతున్నాయి.

వైఎస్సార్‌సీపీ మండల కార్యవర్గాల నియామకం

అచ్యుతాపురం : యలమంచిలి నియోజకవర్గంలోని ఆయా మండలాల వైఎస్సార్‌సీపీ కమిటీలను కేంద్ర కమిటీ కార్యాలయం నుంచి విడుదల చేశారు. యలమంచిలి మున్సిపాలిటీ పరిధి అధ్యక్షునిగా బొద్దపు ఎర్రయ్యదొర, ఉపాధ్యక్షులుగా పిళ్లా గోవింద అయ్యల నాయుడు, మడగల సూర్య సత్యనారాయణ, యలమంచిలి రూరల్ అధ్యక్షునిగా కొల్లి త్రినాథ్‌రావు, ఉపాధ్యక్షులుగా ఉదండం త్రినాథరావు, యల్లపు శ్రీరాములు, రాంబిల్లి మండల పార్టీ అధ్యక్షునిగా పిన్నమరాజు రాధా సుందర సుబ్బరాజు, ఉపాధ్యక్షులుగా గోవిందరాజు, కరణం శ్రీహరి, మునగపాక మండల పార్టీ అధ్యక్షునిగా ఆడారి అచ్చింనాయుడు, ఉపాధ్యక్షులుగా ద్వారం జానకీరావు, అల్లవరపు వెంకట రమణను నియమించారు.

నక్కపల్లి : నక్కపల్లి మండల శాఖ అధ్యక్షుడిగా శీరం నర్సింహమూర్తి ఉపాధ్యక్షులుగా బచ్చల రాజు, ఏరిపల్లి నాగేసు, ఎస్.రాయవరం మండలం అధ్యక్షుడిగా బోలిశెట్టి గోవిందు, ఉపాధ్యక్షులుగా చోడిపల్లి కొండలరావు, చొప్పరాజు, పాయకరావుపేట మండల అధ్యక్షుడిగా చిక్కాల రామారావు, ఉపాధ్యక్షులుగా నీలపు చిరంజీవి రెడ్డి, రామల శ్రీనివాసరావు, కోటవురట్ల మండలం అధ్యక్షుడిగా కె.శ్రీనివాస్ ఉపాధ్యక్షులుగా పైల నాని, లప్పాల స్వామిలను నియమితులయ్యారు.







